కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ట్రాక్టర్లలోకి ఎత్తుతున్న హమాలీలు

ఆమనగల్లులో హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు

# తూకంలో కోత.. అన్నదాతకు వెత

- తరుగు పేరిట ధాన్యంలో కోతలు
- క్వింటాకు 5 కిలోలకు పైగా కటింగ్
- తీవ్రంగా నష్టపోతున్న రైతాంగం
- కరీంనగర్ జిల్లాలోనే తరుగు పేరిట 9 కోట్ల విలువైన ధాన్యం హాంఫట్
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు పట్టని వైనం
- పలుచోట్ల రైతుల నిరసనలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేస్తున్న రైతులు

నమస్తే నెట్‌వర్క్: మార్కెట్ల మాయాజాలంతో అన్నదాత నిలువుదోపిడీకి గురవుతున్నాడు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే చోట తీవ్రంగా నష్టపోతున్నాడు. తరుగు పేరిట ధాన్యం కోతలు విధిస్తూ రైతులను మోసగిస్తున్నారు. ఫలితంగా ఒక్కో రైతు వేలాది రూపాయలు నష్టపోతున్నాడు. నష్టం జరుగుతుందని తెలిసినా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పాలకులు అసలే పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. కరీంనగర్ జిల్లాలో తరుగు పేరిట రైతుల ధాన్యాన్ని క్వింటాలుకు 5.50 కిలోల వరకు అదనంగా తూకం వేస్తున్నారు. సింగిల్ విండోలు, ఐకేపీ, డీసీఎంఎస్, హాకా తదితర కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట ఈ దోపిడీ జరుగుతూనే ఉన్నది. ప్రతి క్వింటాలుకు సంచి బరువు 250 గ్రాములు కాకుండా 5 కిలోల తరుగు తీస్తుండగా, 100 క్వింటాళ్లు అమ్ముకున్న ఒక రైతు తరుగు పేరిట 5 క్వింటాళ్లు కోల్పోవాల్సి వస్తున్నది. మద్దతు ధరతో చూస్తే 100 క్వింటాళ్లు అమ్ముకున్న రైతు రూ.11,160 మేరకు నష్టపోతున్నాడు. కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శుక్రవారం వరకు 12,344 మంది రైతుల నుంచి 99,408 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ లెక్కన చూస్తే ఒక్క కరీంనగర్ జిల్లాలోనే రూ.9 కోట్లకు పైగా విలువైన ధాన్యం తరుగు పేరిట మిల్లులకు చేరినట్టు స్పష్టమవుతున్నది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనడం లేదని కర్షకులు నిరసనకు దిగారు. సరైన సమయంలో కొనకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిసి పాడవుతున్నదని వాపోయారు.

నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో ఆందోళన చేస్తున్న రైతులు

### వనపర్తిలో రాస్తారోకో

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని షరతుల్లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ ఆధ్వర్యంలో పలువురు నేతలు మార్కెట్ యార్డులో రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. జరిగిన నష్టం తెలుసుకొని రైతుల ఆందోళనకు మద్దతుగా నిలిచారు. నెల రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దాదాపు 20 వేల బస్తాలు వర్షానికి తడిశాయని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు, బీఆర్‌ఎస్ నేతలు ఆందోళనను విరమించారు.

### ఖమ్మం జిల్లాలో పలుచోట్ల నిరసనలు

తరుగు, కొర్రీలు లేకుండా, కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిర, తిరుమలాయపాలెం, చంద్రుగొండ మండలాల్లో శనివారం రైతులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో మధిర-విజయవాడ ప్రధాన రహదారిపై శనివారం ధర్నా నిర్వహించారు. 15 రోజులు అవుతున్నా ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. పోలీసుల చొరవతో ఆందోళన విరమించారు. కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్ల తరుగు దోపిడీని నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మార్కెట్ గోదాముల సముదాయంలోని కొనుగోలు కేంద్రంలో రైతులు శనివారం ఆందోళనకు దిగారు. క్వింటాకు 5 నుంచి 7 కిలోల వరకు తరుగు ఇవ్వాలని మిల్లర్లు డిమాండ్ చేయడంతో ససేమిరా అన్న రైతులు ఆందోళన చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో పట్టపగలే ఇంత దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మిల్లర్ల అవినీతిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బందంపల్లి గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు.

### రైతుల ఆందోళనతో దిగొచ్చిన అధికారులు

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతుల ఆందోళనకు అధికారులు దిగొచ్చారు. యాదాద్రి జిల్లా భువనగిరి మండలం బాలంపల్లి గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ఏప్రిల్ 25న కేంద్రాన్ని ప్రారంభించినా, హమాలీల కొరతతో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాయగిరి, బాలంపల్లి గ్రామాలకు చెందిన రైతుల ధాన్యం రాశులు 90కి పైగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం రైతులు కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన అధికారులు శనివారం సాయంత్రం కొనుగోళ్లు చేపట్టారు.

### బీఆర్‌ఎస్ రాస్తారోకో

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో రైతులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

### రైతుల పడిగాపులు

నారాయణపేట జిల్లాలో చేతికొచ్చిన వరి ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లనే కొంటం, దొడ్డు రకం కొనబోమని తెగేసి చెప్తున్నారు. దీంతో చేసేదిలేక రైస్ మిల్లుల వద్దకు వెళ్తే అక్కడా ఇదే పరిస్థితి ఎదురవుతున్నది. జిల్లాలోని మద్దూరు మండల కేంద్రం నుంచి పెదిరిపాడు రోడ్డులో ఉన్న పద్మావతి రైస్‌మిల్లు వద్దకు దాదాపు 60 ట్రాక్టర్లు ధాన్యం లోడుతో వచ్చాయి. మిల్లు యాజమాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఎస్సై, అధికారుల చొరవతో 20 వాహనాలకు రైతులకు టోకెన్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. సింగారం చౌరస్తా సమీపంలోని రైస్ మిల్లు వద్ద ధాన్యంలోడుతో ఉన్న వాహనాలు పెద్ద ఎత్తున బారులుతీరాయి. రెండ్రోజులుగా ధాన్యం విక్రయించేందుకు పడిగాపులు కాయాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన చెందారు.

# పంట కొంటరా.. కొనరా ?

- అన్నదాతల ఆగ్రహాన్ని సర్కార్ చవిచూడక తప్పదు
- ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హెచ్చరిక

ఖలీల్‌వాడి, మే 3: రోడ్లపై ఎక్కడ చూసినా వడ్లే కనిపిస్తున్నాయని.. ప్రభుత్వం అసలు ధాన్యం కొంటుందా.. కొనదా సూటిగా చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మడానికి రైతులు నెల రోజులుగా ఎదురుచూస్తున్నా ఈ ఇందిరమ్మ రాజ్యానికి ఇసుమంత కనికరం లేదని శనివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రోడ్లపై, కల్లాల్లో ఉన్న ధాన్యం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ సర్కార్ నిర్లక్ష్యానికి అన్నదాతల శ్రమ ఆవిరవుతున్నదని, ధాన్యం కొనే దిక్కులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అటు ఐకేపీలు, ఇటు సొసైటీలు ఎవరికివారుగా కేంద్రాలు తెరిచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెబుతున్నప్పటికీ ధాన్యం రాశులు మాత్రం రోడ్లు, కల్లాల నుంచి కదలడం లేదని పేర్కొన్నారు. వడ్లు కొనేందుకు కొర్రీలు పెడుతూ రైతులను అవమానిస్తున్నారని, ధాన్యం అమ్ముడుపోక అన్నదాతలు అవస్థలు పడుతున్నా యంత్రాంగం పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. చివరి గింజ వరకు కొంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అరిగిపోయిన రికార్డును పదేపదే వినిపిస్తున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా కొంటున్న దాఖలాలు లేవని విమర్శించారు.

# 5నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

హైదరాబాద్, మే 3(నమస్తే తెలంగాణ): సాగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించడానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య తెలిపారు. ఈ నెల 5నుంచి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూన్ 13వరకు రాష్ట్రంలోని సుమారు 1200 రెవెన్యూ గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12గంటల వరకు శాస్త్రవేత్తల బృందం రైతులతో సమావేశమవుతుందని చెప్పారు. యూరియా వాడకాన్ని తగ్గించడం, అవసరం మేరకే రసాయనాల వినియోగంపై అవగాహన కల్పించనున్నట్టు ఆయన వివరించారు.

# కాంటాలు పెడతలేరు

- వారాల తరబడి కేంద్రాల్లోనే వడ్లు
- టార్పాలిన్లు లేక వడ్లు తడుస్తున్నయ్
- అధికార పార్టీ ఎమ్మెల్యేల ఆగ్రహం
- కలెక్టర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు: ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్
- యాసంగి బోనస్ ఎవరికీ ఇవ్వ లేదు: ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క

వరంగల్, మే 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని అధికార పార్టీ ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. సర్కారు కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కొనుగోలు సరిగా జరగడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు వారాలు గడిచినా వడ్లను మిల్లులకు తరలించడం లేదని, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి వసతులు ఉండటం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. మంత్రుల సమీక్ష సమావేశంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో వాస్తవాలతో ఫిర్యాదులు చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో వడ్ల కొనుగోలుపై పౌర సరఫరాల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి ధనసరి అనసూయ శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ వడ్ల కొనుగోలు ప్రక్రియలో సమస్యలను వివరిస్తూ అసంతృప్తి వ్యక్తంచేశారు. కాంటాలు ఆలస్యంగా జరుగుతున్నాయని తెలిపారు. కాంటా అయిన వడ్లను మిల్లులకు త్వరగా చేరవేయడం లేదని ఫిర్యాదు చేశారు. వడ్లు కల్లాల్లోనే ఉండటంతో అకాల వర్షాలతో తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్లు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు.

### కొనుగోలు ప్రక్రియలో జాప్యం

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చాలా జాప్యం జరుగుతున్నదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా బస్తాలు లేవని చెప్పారు. కాంటా అయిన వడ్లను మిల్లులకు తరలించేందుకు లారీలు ఉండడం లేదని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలును వేగవంతం చేయాలని కోరారు. వడ్ల కొనుగోలు ప్రక్రియ ఆలస్యవుతున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. చాలా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అసంతృప్తి వ్యక్తంచేశారు.

### కొనుగోళ్లలో ఇబ్బంది లేకుండా చూడాలి : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ధాన్యం దిగుబడిలో ఉమ్మడి ఏపీ రికార్డును తెలంగాణ అధిగమించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని అన్నారు. రెండు సీజన్లలో తెలంగాణలో పండినంత ధాన్యం ఉమ్మడి రాష్ట్రంలో పండలేదని వివరించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# రైతుబీమా కిస్తీ కట్టరా?

- ఫిబ్రవరి ప్రీమియం మే నెల వచ్చినా చెల్లించలేదేం
- సర్కారు నిర్లక్ష్యం.. రైతులకు శాపం
- మాజీ మంత్రి హరీశ్ విమర్శ

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): రైతుబీమాను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నాడు ఏ కారణంతోనైనా రైతు మరణిస్తే, వారి కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడుకోవాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన రైతుబీమాను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతున్నదని శనివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. రైతుబీమా కోసం ఫిబ్రవరిలోనే చెల్లించాల్సిన రూ.775 కోట్ల ప్రీమియాన్ని మే నెల వచ్చినా చెల్లించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరి చూస్తుంటే రాష్ట్రంలో రైతుబీమా అమలు చేస్తున్నదా.. లేక అటకెక్కించిందా అంటూ అనుమానం వ్యక్తంచేశారు. వానకాలం రైతుబంధును ఎగ్గొట్టిన ప్రభుత్వం యాసంగి పంటకు మార్చి 31లోగా చెల్లిస్తామని చెప్పి తాత్సారం చేస్తూ ఈ పథకం అమలును ప్రశ్నార్థకం చేసిందని తెలిపారు. దేవుళ్లపై ఒట్టేసి మాట తప్పిందని అన్నారు. తాము వెంటపడితే సగం మందికి మాత్రమే చేసి మిగిలిన రైతుల ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పాలనను గాలికొదిలి గాలిమోటర్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి, మంత్రులకు రైతు కుటుంబాల కన్నీళ్లు కనిపించడంలేదా అని నిలదీశారు. మూడు నెలల్లో మరణించిన 100 మంది రైతుల కుటుంబాలకు బీమా అందకుండాపోతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ. 5లక్షల చొప్పున చెల్లించాలని, వెంటనే ప్రీమియం కట్టాలని డిమాండ్ చేశారు.

## అప్పులబాధతో ఎరువుల వ్యాపారి ఆత్మహత్య

- దిగుబడులు లేక బకాయిలు చెల్లించని రైతులు
- అప్పులు కట్టలేక మార్క రాజేందర్ బలవన్మరణం
- భూపాలపల్లి జిల్లా శ్రీనివాసపల్లిలో విషాదం

రాజేందర్(ఫైల్)

మహదేవపూర్/కాటారం, మే 3 : అప్పులబాధతో ఎరువుల వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చిదినేపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపల్లిలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్క రాజేందర్ (37) కాటారంలో ఎరువులు, పురుగుమందుల వ్యాపారం చేస్తున్నాడు. తనకున్న ఏడెకరాల వ్యవసాయ భూమిలో మిర్చి, పత్తి సాగుచేశాడు. రైతులకు ఎరువులు ఉద్దెర ఇవ్వడంతో రూ.20 లక్షలదాకా అప్పుల య్యాయి. తెగుళ్లు ఆశించడంతోపాటు ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడులు సరిగా రాకపోవడంతో ఉద్దెర తీసుకెళ్లిన రైతులు ఎరువుల డబ్బులు తిరిగి చెల్లించలేదు. బ్యాంకర్లు, అప్పులవాళ్లు డబ్బుల కోసం ఇబ్బందిపెట్టడంతో రుణం చెల్లించలేక మనోవేదన చెందాడు. ఈ క్రమంలో శనివారం మహదేవపూర్ మండలం అయ్యప్ప ఆలయ సమీపంలోని వాటర్‌ట్యాంక్ వద్ద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య స్రవంతి, కూతురు దీప్తి, కుమారుడు అద్విక్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## పది బోర్లు.. పది లక్షల అప్పు

- యువరైతు ఆత్మహత్య
- కామారెడ్డి జిల్లాలో విషాదం

పెంటయ్య (ఫైల్)

బీబీపేట్(దోమకొండ), మే 3: సాగునీటికోసం భగీరథ ప్రయత్నంచేసిన ఓ యువరైతు అప్పులపాలయ్యాడు. రూ.పది లక్షల దాకా ఖర్చు, పదికి పైగా బోర్లు వేసినా నీటిచుక్క జాడకరువైన తరుణంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సంగమేశ్వర్‌లో ఈ విషాద ఘటన చోటుచేసుకున్నది. ఎస్సై స్రవంతి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువరైతు పంతులుగారి పెంటయ్య (26)కు రెండెకరాల భూమి ఉంది. పొలంలో నీటి వసతి సరిగా లేకపోవడంతో పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలో పెంటయ్య రెండేళ్లుగా నీటికోసం బోర్లు వేయిస్తూ వస్తున్నాడు. పది బోర్లకు పైగా వేయగా చుక్కనీరు కూడారాలేదు. ఈ రెండేండ్లలో రూ.10 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. ఎంత ప్రయత్నించినా నీళ్లు రాకపోవడం, అప్పులు మీదపడటంతో పెంటయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పు తీర్చేమార్గం కనిపించకపోవడంతో శనివారం తెల్లవారుజామున ఇంట్లోనే చీరతో ఉరేసుకున్నాడు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. తల్లి మణెవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మరో మూడ్రోజులు వర్షాలు

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): రానున్న మూడ్రోజులు ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఉత్తర-దక్షిణ ద్రోణి ఇప్పుడు ఆగ్నేయ రాజస్థాన్, పొరుగు ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి గుజరాత్, మహారాష్ట్ర, అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నదని తెలిపింది. దీంతో తెలంగాణలోని 7జిల్లాలకు భారీ వర్షసూచన ఉన్నట్టు వెల్లడించింది. 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నది. ఇదిలా ఉండగా శనివారం రాష్ట్రంలో పలు జిల్లాల్లో 40 డిగ్రీల కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, నిజామాబాద్ జిల్లా మోస్రాలో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు తెలిపింది. ఇక కుమ్రంభీం, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ము లుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసినట్టు వివరించింది.

# ఇది మూడు వేల కోట్ల స్కాం

- నిరుడు దీపావళి పండుగ రోజే హైదరాబాద్ కేంద్రంగా బీజం
- 60 వేల ఫేక్ టెంపరరీ రిజిస్ట్రేషన్ల నంబర్లతో రైతులకు మోసం
- స్కాంలో ప్రభుత్వ పెద్దలు, కాటన్ కార్పొరేషన్ అధికారుల హస్తం
- ట్రేడర్లు, బ్రోకర్ల ఖాతాల్లోకి రూ. 3,000 కోట్ల మళ్లింపు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సంచలన ఆరోపణలు

హైదరాబాద్, మే 3(నమస్తేతెలంగాణ): పత్తి కొనుగోళ్ల పేరిట కాంగ్రెస్ నేతలు భారీ కుంభకోణానికి తెరలేపారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. 60 నకిలీ టీఆర్ (టెంపరరీ రిజిస్ట్రేషన్) నంబర్లతో ట్రేడర్లు, బ్రోకర్ల ముసుగులో దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. రైతుల ఖాతాల్లోకి చేరాల్సిన రూ. 3వేల కోట్లు కాంగ్రెస్ నేతల ముసుగులోని నకిలీ ట్రేడర్లు, బ్రోకర్ల ఖాతాల్లోకి వెళ్లాయని తెలిపారు. నిరుడు దీపావళి నాడు హైదరాబాద్‌లోని ఓ 5స్టార్ హోటల్‌లో సీసీఐ అధికారులు, ప్రముఖ ట్రేడర్స్ మధ్య జరిగిన రహస్య సమావేశంలోనే ఈ కుంభకోణానికి బీజం పడిందని స్పష్టంచేశారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తే దొంగలు దొరికిపోతారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ స్కాం వెనుక ప్రభుత్వ పెద్దలు, సీసీఐ ఉన్నతాధికారులు ఉన్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులపై వేటు పడటం, మరో 130 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడమే అవకతవకలు జరిగాయనేందుకు నిదర్శనమని పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు.

### 20 శాతం మంది రైతుల నుంచి 80 శాతం కొనుగోళ్లా?

రాష్ట్రవ్యాప్తంగా 2024-25లో 25 లక్షల మంది రైతులు 49 లక్షల బేళ్ల పత్తి పండించారని వ్యవసాయశాఖ ప్రకటించిందని పెద్ది చెప్పారు. ఇందులో 41 లక్షల బేళ్ల (80 శాతం) పత్తిని కేవలం 6.30 లక్షల మంది (20 శాతం) రైతుల నుంచి, 8 లక్షల బేళ్లను ట్రేడర్ల ద్వారా సేకరించామని సీసీఐ వెల్లడించిందని, కనీస మద్దతు ధర రూ.7521 చెల్లించి కొనుగోలు చేసినట్టు ఆన్‌లైన్‌లో వివరాలు పెట్టిందని తెలిపారు. 'మరి 80 శాతం పత్తిని 20 శాతం మంది రైతుల నుంచి కొంటే మిగిలిన పత్తిని ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేసినట్టు? మద్దతు ధర ఎవరికి చెల్లించినట్టు? సుమారు 18 లక్షల మంది రైతులు పత్తిని ఎవరికి అమ్ముకున్నట్టు?' అంటూ సీసీఐ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ నాయకులు బ్రోకర్లు, ట్రేడర్ల అవతారమెత్తి సిండికేట్‌గా మారి రైతుల నుంచి రూ.5వేల నుంచి 5,500కు కొని సీసీఐకి క్వింటాల్‌కు రూ.7,521కు అమ్మినట్టు ఆరోపించారు.

### ఉద్దేశపూర్వకంగానే కొనుగోళ్ల ఆలస్యం..

ఏటా అక్టోబర్‌లో ప్రారంభించాల్సిన పత్తి కొనుగోళ్లను ఈ సీజన్‌లో నవంబర్ మొదటి వారంలో చేపట్టారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సివిల్ సప్లయ్ టెండర్ల స్కాంలో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హస్తం ఉన్నదని ఆరోపించారు. అందుకే కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వం వెనుకాడుతున్నదని చెప్పారు.

| పత్తి సాగు : 43 లక్షల ఎకరాలు | |
|---|---|
| సాగు చేసిన రైతులు : 25 లక్షల మంది | ఉత్పత్తి అయిన పత్తి : 49 లక్షల బేళ్లు |
| సీసీఐ కొనుగోలు చేసింది : 41 లక్షల బేళ్లు | ప్రైవేట్ వ్యాపారులు కొన్న పత్తి: 8 లక్షల బేళ్లు |
| సీసీఐకి అమ్మిన రైతులు : 6 లక్షల 30 వేలు | ట్రక్ పట్టీలు జారీ చేసినవి: 9 లక్షలు |
| పత్తి మద్దతు ధర: రూ. 7,521 | రైతులకు లభించిన ధర : సుమారు రూ. 5500 |
| వ్యత్యాసం : సుమారు 2000 | |

# పత్తి కొనుగోళ్లలో అక్రమాలు?

- ఎన్నడూ లేని విధంగా భారీగా టెంపరరీ రిజిస్ట్రేషన్ల జారీ
- 54 వేల మంది రైతులకు తాత్కాలిక రిజిస్ట్రేషన్లు
- వీరిలో 10 వేల మందే అసలోళ్లు
- మిగతావాళ్లంతా మిల్లులు, ట్రేడర్స్‌కు సంబంధం ఉన్నవారే
- జారీలో ఏఈవో, ఏవో, కార్యదర్శుల చేతివాటం
- రైతుల నుంచి క్వింటాల్ 5-6 వేల ధరకు కొని నకిలీ టీఆర్‌లతో సీసీఐకి రూ.7,521కు విక్రయం
- పత్తిపొడవు తేల్చడంలోనూ జిమ్మిక్కు
- తక్కువ పొడవున్నా ఎక్కువ చూపి అధిక ధర చెల్లించిన వైనం

హైదరాబాద్, మే 3(నమస్తే తెలంగాణ) : పత్తి కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగినట్టు తెలుస్తున్నది. అడ్డగోలు టీఆర్ (టెంపరరీ రిజిస్ట్రేషన్లు)లు జారీ చేసి అవకతవకలకు పాల్పడినట్టు మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనాకు వచ్చినట్టు తెలిసింది. ఈ సీజన్‌లో ఏకంగా 54 వేల టీఆర్‌లు జారీ చేసినట్టుగా గుర్తించారు. వీటిలో కేవలం 10 వేల మంది మాత్రమే అసలు రైతులు ఉండగా మిగిలిన వారంతా జిన్నింగ్ మిల్లులు, ట్రేడర్స్‌కు సంబంధించిన వాళ్లేనని తేలినట్టు తెలిసింది. వీళ్లంతా రైతుల నుంచి తక్కువ ధరకు అంటే క్వింటాలుకు రూ. 5500 నుంచి రూ.6 వేల వరకు పత్తి కొనుగోలు చేసి ఆ తర్వాత నకిలీ టీఆర్‌లతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కు మద్దతు ధర రూ.7521కు అమ్మినట్టుగా విచారణలో గుర్తించారు. ఇందులో భాగంగానే జిన్నింగ్ మిల్లులు, ప్రైవేట్ ట్రేడర్లతో సీసీఐలోని పలువురు అధికారులు కుమ్మక్కైనట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీఐ అధికారులకు తెలియకుండా ఇంత భారీ సంఖ్యలో టీఆర్‌లను ఎలా జారీ చేస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఇక టీఆర్‌ల జారీలో వ్యవసాయ శాఖకు సంబంధించిన ఏఈవోలు, ఏఈవోలతో పాటు మార్కెటింగ్ శాఖకు చెందిన మార్కెటింగ్ కార్యదర్శులు కీలక పాత్ర పోషించినట్టుగా తెలిసింది. జిన్నింగ్ మిల్లులు, ట్రేడర్లతో చేతులు కలిపి అడ్డదారిలో అడ్డగోలుగా టీఆర్‌లు ఇచ్చినట్టు సమాచారం. కొందరు ఏఈవోలు, ఏవోలు నకిలీ టీఆర్‌లు ముద్రించి మరీ ఇచ్చినట్టు తెలిసింది. వీటిపై మార్కెటింగ్ కార్యదర్శులు గుడ్డిగా సంతకాలు చేశారని, దీంతో పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు రాచమార్గం పడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పత్తి పొడవులోనూ..

అడ్డగోలు టీఆర్‌ల జారీతోనే కాకుండా పత్తి పొడవులోనూ అవకతవకలకు పాల్పడినట్టు తెలిసింది. పత్తి పొడవును బట్టి ధర ఉంటుంది. మధ్యస్థ రకానికి రూ.7,121 మద్దతు ధర ఉండగా లాంగ్ స్టాపుల్ (పొడవు గింజ) రకానికి రూ.7,521గా ధర ఉన్నది. అంటే రెండింటి మధ్య రూ.200 వ్యత్యాసం ఉన్నది. దీంతో సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లులు, ట్రేడర్లు దీన్ని ఆసరాగా చేసుకొని అవకతవకలకు పాల్పడినట్టు తెలిసింది. మధ్యస్థ రకాన్ని కూడా లాంగ్ స్టాపుల్ రకంగా గుర్తించి అధిక ధర చెల్లించినట్టు సమాచారం. ఇలా భారీగా సొమ్మును వెనకేసుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.